క్లుప్తంగా

ఉజ్వల పథకానికి దరఖాస్తు చేసుకోండి

ఉంగుటూరు: ఉజ్వల పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, బీజేపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి కోరారు. గ్యాస్ లేకుండా ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను ఉంగుటూరు సామాజిక భవనంలో శుక్రవారం స్వీకరించారు. గ్యాస్ లేని మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. మహిళలకు ఉపయోగపడే గ్యాస్ పథకం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అవుట్ డోర్ జిమ్ ఏర్పాటు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో అవుట్ డోర్ జిమ్ నిర్మాణం పూర్తయింది. ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు శుక్రవారం అవుట్ డోర్ జిమ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ తపన చైర్మన్ గారపాటి సీతారామాంజనేయులు రూ.5 లక్షల ఆర్థిక సాయంతో జిమ్ నిర్మించారు. కళాశాలలో యూజీడీ, బీపీఈడీ వ్యాయామ అధ్యాపక విద్యార్థులకు శిక్షణలో భాగంగా ప్రాథమికంగా అవుట్‌డోర్ జిమ్ ఎంతో అవసరమన్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు దాత గారపాటి సీతారామాంజనేయ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన తప్పనిసరి

పెదవేగి: ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరని మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ కేఆర్ సురేష్‌బాబు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణా సంస్థ పర్యవేక్షణలో శుక్రవారం పెదవేగి మండలం చక్రాయిగూడెం సచివాలయం వద్ద మొబైల్ ఐసీటీసీ ద్వారా ఉచిత హెచ్ఐవీ, సిఫిలిస్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో 63 మందికి పరీక్ష చేసి, రిపోర్టులు అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ నాగజ్యోతి, మౌనిక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యా సంస్థలకు పోలీస్ సహకారం

దెందులూరు: ప్రజలతో పాటు ప్రధానంగా విద్యా సంస్థలకు పోలీస్ శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. శుక్రవా రం జోగన్నపాలెం మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నత పాఠశాలలో ఫౌండర్ కరస్పాండెంట్ వసీఉల్లా అధ్యక్షతన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శివాజీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. డైరెక్టర్లు మహమ్మద్ ఒసామా కరస్పాండెంట్ వసీవుల్లా ఎస్సైను ఘనంగా సత్కరించారు.

1211 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

దెందులూరు: పోతునూరు పశు వైద్యశాల పరిధిలో మూడు గ్రామాల్లో 1211 పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్లు చేశామని పశువర్ధక శాఖ పోతునూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ మహమ్మద్ బాజీ అన్నారు. శాఖ పరంగా 1400 పశువులకు వ్యాక్సిన్లు చేయాల్సి ఉండగా శుక్రవారానికి 1211 పశువులకు వ్యాక్సిన్లు వేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేరంటాలమ్మ ఉత్సవాల ప్రచారం

దెందులూరు: కోస్తా జిల్లాల్లో ప్రముఖమైన గాలాయగూడెం గ్రామంలో వెలసిన అచ్చమ్మ పేరంటాలు తల్లి 69వ వార్షికోత్సవం విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది. శ్రీఅచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాలపై ప్రచారంలో భాగంగా ఆలయ కమిటీ మాట్లాడుతూ జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు కుంకుమ పూజలతో పాటు సాయంత్రం కోలాటం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి యాప్‌ల బహిష్కరణ

గణపవరం: ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసి, తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న యాప్‌లను మండలంలోని ఉపాధ్యాయులు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్యకు వినతిపత్రం అందచేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన యాప్‌లు తప్ప మరే ఇతర యాప్‌లను వినియోగించమని ప్రకటించారు. పాఠశాలలు తెరిచి నాలుగు నెలలైనా నేటికీ విద్యా బోధన గాడిన పడలేదని, రోజూ రకరకాల యాప్‌లు, వివరాల నమోదుతోనే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో మండల ఫ్యాప్టో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల బహిష్కరణ

పెదవేగి : బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ బృందం ఎంఈఓ–2 అరుణ్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు బోధనేతర పనులు, విద్యాశక్తి బహిష్కరిస్తామని నిరసన వ్యక్తం చేశారు. నాయకులు పరసా నాగార్జున, తేరా ప్రభాకర్, పి.రమేష్, జి.కృష్ణ, ఎన్.ప్రవీణ్ కుమార్, కె.శ్రీనివాసరావు, టి ప్రవీణ్ కుమార్, గుప్తా, విద్యాసాగర్, వి.అమృత్, ధనకాంత తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కూటమి కక్ష

- పని గంటలు పెంచుతూ నిర్ణయం
- బిల్లును ఆమోదించిన కూటమి పార్టీలు
- మండిపడుతున్న శ్రామికులు


భవన నిర్మాణ పనిలో నిమగ్నమైన కార్మికులు

దెందులూరు: కార్మిక వర్గం అంతర్జాతీయంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చి, అదనంగా మరో రెండు గంటల పాటు పని చేసేలా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిన కూటమి ప్రభుత్వంపై కార్మికులు మండిపడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోగా అదనంగా రెండు గంటల పాటు పని చేయించుకోవడం అంటే తమ శ్రమను దోచుకోవడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌లోని అంశాలను రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమలు చేయడాన్ని ఖండిస్తున్నారు. ఏపీ అసెంబ్లీలో ఎన్డీఏ పార్టీలు అన్నీ కలిసి ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిచేసే కార్మికుల పని గంటల పెంపును ఆమోదించడం దారుణమని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కనీస వేతనాలు పెంచని ప్రభుత్వం. పని గంటలు పెంచడంతో భగ్గుమంటున్నారు. కార్మిక వర్గంపై కనీస చిత్తశుద్ధి ఉంటే బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓటీకి టాటా

పరిశ్రమలు, దుకాణాల్లో ఇప్పటి వరకూ 8 గంటల పని విధానం అమల్లో ఉంది. కార్మికులు అదనంగా ఒకటి, రెండు గంటలు పనిచేస్తే వారికి ఓటీ ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. ఎందుకుంటే కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వలన కార్మికులు ప్రతి రోజూ అదనంగా మరో రెండు గంటలు పనిచేయాల్సి వస్తోంది. దీని వలన వ్యాపారవేత్తలకు లాభం ఉంటుంది. కానీ కార్మికులకు అదనంగా ఒక్క రూపాయి కూడా రాదు.

సుమారు 60 వేల మందిపై భారం

జిల్లాలో ప్రధాన వాణిజ్య కేంద్రమైన ఏలూరులో అనేక ఆసుపత్రులు, మాల్స్, బట్టల షాపులు, నగల దుకాణాలు ఉన్నాయి. నగరంలోని అన్ని షాపుల్లో సుమారు 60 వేల మందికి పైగా పని చేస్తున్నారని అంచనా. ఇప్పటి వరకూ వీటిలో మూడు షిఫ్టులుగా పని చేసేవారు. ఇక నుంచి అవి రెండు షిఫ్టులకే పరిమితమవుతాయి. ఏలూరు రోడ్లు లో పలుచోట్ల షాపులు, మాల్స్, హస్పిటళ్లు అధికంగా ఉన్నాయి. వీటిలో పనిచేసే వారందరూ ఇప్పుడు రోజుకు పది గంటల చొప్పున పని చేయాల్సి ఉంటుంది.

మహిళలకు రక్షణ కరవు

మహిళలు అదనంగా మరో రెండు గంటలు పని చేయడం వలన రాత్రి సమయాల్లో ఇంటికి చేరాల్సి వస్తోంది. దీని వలన వారికి రవాణా సమస్యలు ఏర్పడతాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కరువైంది. ఇక రాత్రి సమయాల్లో వారు ప్రయాణం చేయడం వలన పూర్తిగా రక్షణ లేని పరిస్థితి కలుగుతుంది.

పని భారం తగ్గించాలి



ప్రస్తుతం కార్మికులకు ఎనిమిది గంటల పని చేయడమే భారంగా మారింది. దీనిని పది గంటలకు పెంచడం వలన ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుండా పారిశ్రామిక అవసరాల కోసం 12 గంటల పాటు చేయించుకోవచ్చనే అనే వెసలుబాటును బిల్లులో పెట్టి దాన్ని కూడా ఆమోదించారు.
– కాకర్ల శ్రీను, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సభ్యులు

కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతారు



ప్రస్తుతం అన్ని చోట్లా యాంత్రీకరణ పెరగడం వలన కార్మికులు పని చేయాల్సిన వేగం కూడా ఎక్కువైంది. శ్రమ దోపిడీకి గురవుతారు. ఈ తరుణంలో ఉన్న పని గంటలు తగ్గించాల్సింది పోయి, అదనంగా పెంచడం దారుణం. దీని వలన కార్మికులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. 8గంటల పని విధానాన్నే కొనసాగించాలి.
– కాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

గణపవరాన్ని పశ్చిమగోదావరిలో కొనసాగించాలి


గణపవరాన్ని ఏలూరులో కలపొద్దని మంత్రి నాదెండ్లకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

గణపవరం: మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపాలన్న నిర్ణయాన్ని ఏమాత్రం సహించబోమని, పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని అఖిలపక్ష నాయకులు పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంత్రి కార్యాలయం వద్ద ఆయనను గణపవరం మండలం నుంచి అఖిలపక్ష నాయకులు శుక్రవారం కలిసి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు ముత్యాల వేణు, అఖిలపక్ష నాయకులు యాళ్ల సుబ్బారావు, కె.జగపతిరాజు, కాపారపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రజలకు మేలు

ఉంగుటూరు: తగ్గించిన జీఎస్టీ మధ్యతరగతి, పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో సూపర్ జీఎస్టీ–సూపర్ అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పేద విద్యార్థులపై కూటమి కన్నెర్ర

- వైద్య విద్యకు పేదలను దూరం చేసే ఎత్తుగడ
- కూటమి అరాచకాలకు ప్రజలే అడ్డుకట్ట వేయాలి


కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాసుబాబు

గణపవరం: రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికే కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దీనిలో భాగంగానే మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ధారాదత్తం చేయాలన్న నిర్ణయం తీసుకుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం వాసుబాబు క్యాంపు కార్యాలయంలో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు సమర్పించాలన్న పార్టీ నిర్ణయం మేరకు ప్రతి కార్యకర్త కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో కష్టపడి పేద విద్యార్థుల కోసం చరిత్రలో నిలిచిపోయేలా ఒకేసారి 17 మెడికల్ కాలేజీలను నిర్మించారని, కేవలం వైఎస్ జగన్‌కు మంచిపేరు వస్తుందన్న దుర్బుద్ధితోనే ఈ కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతుందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి, జరుగుతున్న దారుణాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు దండు రాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కోడే కాశీ, కమ్మిల భాస్కర్‌రాజు, శెట్టి రాజా, మద్దుల రాజా, వెజ్జు వెంకటేశ్వరరావు, యెలిశెట్టి పాపారావు, పెనుగొండ బాలకృష్ణ, రామకుర్తి నాగేశ్వరరావు, తెనాలి సునీల్, ధనుకొండ బుజ్జి, శ్రీనివాసరెడ్డి, బత్తి సాయి, గోపీరాజు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో..

ఉంగుటూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా నేడు శనివారం సాయంత్రం 4 గంటలకు ఉంగుటూరు దళితపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కోటి సంతకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మరడ మంగరావు వెల్లడించారు. ఈ ప్రజా ఉద్యమం కార్యక్రమానికి పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు.

నేడు పోస్టర్ ఆవిష్కరణ

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం అశోక్ నగర్‌లోని అబ్బయ్య చౌదరి కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్ విడుదల చేస్తారని తెలిపారు. ఈ మేరకు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయం తెలిపారు.

లైసెన్స్ రెన్యువల్ చేసుకుంటేనే అమ్మకాలు


బువ్వనపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిడమర్రు: లైసెన్సులు రెన్యువల్ పూర్తి చేయకుండా అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దుర్గాప్రసాద్ బాణసంచా దుకాణదారులను హెచ్చరించారు. శుక్రవారం బువ్వనపల్లిలోని రాజా ఫైర్ వర్క్ దుకాణాన్ని తనిఖీ చేసి లైసెన్స్ రెన్యూవల్ చేసుకోని కారణంగా బాణసంచా తయారీ, అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో నిడమర్రు సీఐ నక్కా రజనీకుమార్, ఎస్సై ఎస్ఎంవీవీ రమేష్, ఫైర్ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

దీపావళి బాణసంచా అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని ఎస్సై ఎస్ఎంవీవీ రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పీఎస్‌లో బాణసంచా షాపుల నిర్వాహకులతో నిబంధనలు, జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులు, దుకాణదారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత న్యాయ సహాయం


విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెదవేగి: విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందటంలో ఇతర న్యాయ సహాయం కావాల్సిన దగ్గరలోని న్యాయ సేవాధికార సంస్థలను లేదా 15100 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు పెదవేగి మండలం వంగూరు గ్రామంలోని జేఅండ్‌జే కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విన్న ప్రతిభావంతులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారిని ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, ప్యానల్ న్యాయవాది బి.సంగీతరావు, పాఠశాల మేనేజర్ డొమ్నిక్, మానసిక వైద్యులు పాల్గొన్నారు.

అందుబాటులో గోనె సంచులు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు

గణపవరం: సార్వా పంట మాసూళ్ల సమయం దగ్గర పడుతుందని, మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో ఈ వారంలో 50 శాతం గోనె సంచులు అందుబాటులో ఉంచుతామని గణపవరం తహసీల్దార్ వైకేవీ అప్పారావు తెలిపారు. శుక్రవారం గణపవరం మండల కార్యాలయంలో మండలంలోని రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జిలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది, మాస్టర్ ట్రైనర్స్, టెక్నికల్ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కస్టోడియన్ అధికారుల సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్, సివిల్ సప్లై అధికారి ప్రవీణ్, లక్ష్మీకుమారి, దాసు, బుద్దాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ టెస్ట్‌పై వర్క్‌షాప్

ఉంగుటూరు: నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ టెస్ట్ కోసం శుక్రవారం ఎనలిటికల్ స్కిల్స్, న్యూమరికల్ ఎబిలిటీ, మెంటల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్ మొదలగు పోటీ పరీక్షల సబ్జెక్టులపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య వక్తగా విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి కె.శ్యామ్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాల్లో తర్ఫీదు ఇచ్చినట్లు వైస్ ప్రిన్సిపాల్ డి.రెడ్డయ్య, అకాడమిక్ కో–ఆర్డినేటర్ కొండా రవి తెలిపారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకులు టి.బాబూరావు, భౌతిక శాస్త్ర అధ్యాపకులు బీవీ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: దెందులూరు మండలం రామారావు గూడేనికి చెందిన ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలి పనులు చేసుకునే చట్టుమాల డేవిడ్‌రాజు(50)కు భార్య, పిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి ఇంటివద్దనే గుర్తు తెలియని కారణాలతో డేవిడ్‌రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యస్థితి విషమించటంతో అతను శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు జీజీహెచ్ వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. దెందులూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జిలే దిక్కు

దెందులూరు: మండలంలో ప్రధాన పోస్టులు కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న పోస్టుల్లో ప్రభుత్వం కొత్త నియామకాలు బదిలీలు చేపట్టకపోవడంతో నెలలు తరబడి ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు. దీంతో వారు ఏ పోస్టుకూ న్యాయం చేయలేకపోతున్నారు. సీడీపీఓ, ఎంపీడీవో, ఈఓఆర్డీ, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, దెందులూరు సీహెచ్‌సీలో మూడు వైద్య పోస్టులు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్, సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్, ఎంఈఓ కార్యాలయంలో సీఆర్పీ పోస్టులు, గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం, గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే హార్టికల్చర్ ఆఫీసర్ కరణ్‌కు ఏకంగా ఏడు మండలాలు ఇన్‌చార్జి ఇచ్చారు. సోమవరప్పాడు గ్రామ కార్యదర్శికి అదనంగా మరో మూడు పంచాయతీలు అప్పగించారు. అనేక చోట్ల కార్యదర్శులు, వీఆర్‌వోలు అదనపు భారం మోస్తున్నారు.

చలివేంద్రం ముసుగులో ఆక్రమణ


ఉంగుటూరు సెంటర్‌లో అధికార పార్టీ నాయకుడు నిర్మిస్తున్న కట్టడం

ఉంగుటూరు: నియోజకవర్గంలో పరిస్థితి కంచే చేను మేస్తే అన్న చందంగా తయారైంది. నియోజకవర్గ స్థాయి నాయకుడు ఉంగుటూరు సెంటర్‌లో సచివాలయం, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాన్ని కబ్జా చేసి గది నిర్మించారు. ఈ కబ్జా మంచినీటి చలివేంద్రం ముసుగులో చేశారు. ఈ స్థలం జాతీయ రహదారుల సంస్థలకు చెందినది. కాగా నాలుగు రోజుల నుంచి చకచకా ఈ నిర్మాణం చేశారు. చలివేంద్రానికైతే పిల్లర్లు వేసి నిర్మించాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదీ వానాకాలంలో చలివేంద్రం ఏమిటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. వేసవిలో చలివేంద్రానికి ఉపయోగించి, ఆ ముసుగులో జనసేన పార్టీ కార్యాలయానికి గాని, పార్టీ నాయకుడు ఆఫీసుకు గాని ఉపయోగించొచ్చని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

నిడమర్రు: నిడమర్రులో ప్రభలుతున్న వైరల్ జ్వరాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం నిడమర్రు గ్రామంలో బుధవారం నుంచి జరుగుతున్న ఫీవర్ సర్వేలెన్స్ పూర్తయిన సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. గ్రామంలో కొత్తగా జ్వరంతో బాధపడుతున్న వారు ఇద్దరే అన్నారు. వీరిని డెంగీ అనుమానిత కేసులుగా గుర్తించి ఆయా ఇంటి వద్ద నివారణ మందును స్ప్రే చేయించినట్లు తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి రత్నంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం

ఉంగుటూరు: సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా సర్పంచులు, కార్యదర్శులు పనిచేయాలని ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు, పర్యావరణ పరిరక్షణ దిశగాను, పేదరిక నిర్మూలన దృష్టితో పాలక వర్గాలు పనిచేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు జీజీ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు.

ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం శ్రామికులు తమ పేర్లను ఈకేవైసీ తప్పక చేయించుకోవా లని ఉపాధి హామీ ఏపీవో పి.ఫాతిమా ప్రసన్న అన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు ఈకేవైసీపై అవగాహన కల్పించాలన్నారు.

పోటీతత్వంతోనే విజయాలు


దెందులూరు: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు


పెదపాడు: మండల స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులు

దెందులూరు: పోటీతత్వం, ప్రణాళిక, నిరంతర సాధనతోనే విజయం సాధ్యమవుతుందని కొవ్వలి ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, ఫిజికల్ డైరెక్టర్ జక్కుల సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాల ప్లస్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. అనంతరం వ్యాయామ విద్యలో విశిష్ట సేవలందిస్తున్న కస్తూరిబా మున్సిపల్‌బాలికల హైస్కూల్ పీడీ కె.మురళీకృష్ణ, సెయింట్ థెరిస్సా బాలికల ఉన్నత పాఠశాల పీడీ వై.మురళీ కృష్ణమ్మకు హెచ్ఎం, పీడీలు సన్మానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి కర్నాటి

రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల విద్యార్థి కర్నాటి రత్నభూషణ్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు తుంపాటి బాబూరావు తెలిపారు. ఈ నెల 10న ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో తూంపాటి రత్నభూషణ్ తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని పాఠశాల గ్రంథపాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుల వెంకటనారాయణ అన్నారు.

మండల స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు

పెదపాడు: పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ రావు తెలిపారు. పాఠశాల ఆటల పోటీలు వట్లూరు హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. దీంతో వారిని శుక్రవారం పాఠశాలలో అభినందించారు.